అర్హత ఉన్నా.. అభివృద్ధి సున్నా..

'మోడల్ పాలిటెక్నిక్'పై నిర్లక్ష్యం
- పాలకులు మారుతున్నా ప్రగతికి దూరం
- ఇంజనీరింగ్‌గా అప్‌గ్రేడ్ ఎప్పుడు?
- ఎదురు చూస్తున్న విద్యార్థులు



జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: పదోతరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులకు వృత్తి నైపుణ్యంలో శిక్షణనిచ్చి వారి భవిష్యత్‌కు బాటలు వేసేందుకు పాలిటెక్నిక్ విద్య ఎంతో దోహదపడుతుంది. అందుకు గజ్వేల్లో ప్రభుత్వ ఆదర్శ గురుకుల(జీఎంఆర్) పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించారు. ప్రతి విద్యార్థికి హాస్టల్ సౌకర్యం కల్పించి శిక్షణను అందిస్తున్నారు. జిల్లాలో ఇదే ఎస్సీ బాలుర పాలిటెక్నిక్ కళాశాల. ఈ కళాశాలకు అన్ని అర్హతలు ఉన్నా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కొత్త ప్రభుత్వమైనా కళాశాలను ఇంజనీరింగ్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సంగాపూర్ మార్గంలో 1988లో అప్పటి ఎమ్మెల్యే సంజీవరావు 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ ఆదర్శ గురుకుల పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేశారు. దానిలో 15 తరగతిగదులతో పాటు 10ల్యాబ్‌లు, 6 వర్క్‌షాప్‌లు, 1 స్టాఫ్‌రూమ్ ఉంది. అన్ని వసతులు, సౌకర్యాలను కల్పిస్తూ విద్యాబోధన చేపట్టారు. మూడేళ్ల కాలపరిమితితో కొనసాగుతున్న ఈ పాలిటెక్నిక్ కళాశాలలో 3 గ్రూప్‌లు ఉండగా ఎస్సీలకు 75 శాతం, ఎస్టీలకు 5శాతం, బీసీలకు 10శాతం, ఇతరులకు మరో 10శాతం చొప్పున సీట్లను కేటాయించారు.

ఈ కళాశాలలో ఈసీఈ(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్), సీసీపీ(కంప్యూటర్ అండ్ కమర్షియల్ ప్రాక్టీస్), మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులు బోధిస్తున్నారు. ఒక్కో బ్రాంచ్‌లో 60 మంది చొప్పున 3 బ్రాంచ్‌లలో ప్రథమ, ద్వితీయ, తృతీయసంవత్సరాల్లో విద్యనభ్యసిస్తున్నారు.

జీఎంఆర్‌కు ప్రత్యేక గుర్తింపు

1988 నుంచి ఇప్పటి వరకు వేలాది మంది విద్యార్థులకు శిక్షణను అందిస్తూ ఈ కళాశాల జిల్లాలోనే ఆదర్శంగా నిలిచింది. అధ్యాపకులు, సిబ్బందితో కలిపి మొత్తం 50 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. ఈ పాలిటెక్నిక్ కళాశాలకు అనుసంధానంగా 1990లో హాస్టల్‌ను సైతం ఏర్పాటు చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతిని కల్పిస్తూ బోధన చేపడుతున్నారు. ప్రస్తుతం ఈ హాస్టల్‌లో 75 గదులుండగా 350 మంది వరకు విద్యార్థులున్నారు. కళాశాలకు స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆమోదం, నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్‌తో పాటు ఐఎస్‌వో 9001 గుర్తింపు లభించింది. 10వ తరగతి పూర్తి చేసి పాలిసెట్ అర్హత పరీక్షను రాసిన విద్యార్థులు ఇప్పటి వరకు వేలాది మంది పాలిటెక్నిక్‌ను పూర్తి చేశారు. అయితే ఇక్కడ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం ఉంది.

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా



జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తా. ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఒక్కటి కూడా లేదు. మాజీ ముఖ్యమంత్రి ఏనాడూ పట్టించుకోలేదు. ఈ విషయమై మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి ఇంజనీరింగ్ కళాశాలగా మార్చేందుకు కృషిచేస్తా.

– రాచకొండ ప్రశాంత్,
ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి

'హాఫ్ మారథాన్' ఆవిష్కరించిన మంత్రి పొన్నం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: హుస్నాబాద్ రన్నర్స్ అసోసియేషన్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 10న నిర్వహించే హాఫ్ మారథాన్, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లింక్, పోస్టర్‌లను గురువారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. పట్టణంలో 5కే, 10కే, 21కే 4వ ఎడిషన్ రన్నింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను మంత్రి పొన్నం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

బహుజన కార్మిక సంఘాల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్, బీడీఎస్ఎఫ్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బహుజన కార్మిక సంఘాల సమాఖ్య క్యాలెండర్‌ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆవిష్కరించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంల బీడీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దబ్బేట ఆనంద్ మాట్లాడుతూ కామ్రేడ్ మారోజు వీరన్న ఆలోచనలతో ఈ దేశంలో అణగారిన కులాల బహుజన రాజ్యం సాధించుకునే దిశగా పోరాటం సాగుతుందన్నారు. నిచ్చెన మెట్ల కులవ్యవస్థను కూలగొట్టి బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీడీఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్, మురళీకృష్ణ, కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి, కలీమొద్దీన్, దేవులపల్లి యాదగిరి, రాజ్ బహదూర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామ పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రత్యేక అధికారి సరోజ



గ్రామసభలో మాట్లాడుతున్న సరోజ

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యతగా తీసుకొని మన పరిసరాలను మనమే స్వచ్ఛతగా ఉంచాలని బీసీ సంక్షేమ జిల్లా అధికారి సరోజ అన్నారు. గురువారం పొట్లపల్లిలో నిర్వహించిన గ్రామసభకు హాజరై మాట్లాడారు. ఈ నెల 7 నుంచి 14 వరకు చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలలో ప్రజలు పాల్గొని జయప్రదం చేశారన్నారు. ఇదే ఉత్సాహంతో మన ఊరును మనమే బాగు చేసుకోవడానికి కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. సర్పంచ్‌లు లేరనే లోటును అధిగమించి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. వివిధ గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల ముగింపును ప్రత్యేక అధికారుల అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం

నూతన మున్సిపల్ కమిషనర్ నర్సయ్య



గజ్వేల్: ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ముందుకుసాగుతానని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ నూతన మున్సిపల్ కమిషనర్ గొల్కొండ నర్సయ్య అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ మున్సిపాలిటీ నుండి బదిలీపై వచ్చిన ఆయన గురువారం ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యలోప నివారణతోపాటు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. సకాలంలో సేవలన్నీ అందేలా చూస్తామన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బెజ్జంకి(సిద్దిపేట): ఇథనాల్ ఫ్యాక్టరీకి ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని కోరుతూ నర్సింహులపల్లె గ్రామస్తులు గురువారం బెజ్జంకి తహసీల్దార్ శ్యాంకు వినతి పత్రం అందజేశారు. పోతారం శివారులో నిర్మించేందుకు ఇచ్చిన అనుమతుల వల్ల అక్కడి వ్యవసాయ భూములకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు, రైతులు పాల్గొన్నారు.

చిన్నారి శ్రేయకు అవార్డులు



అవార్డును అందుకుంటున్న శ్రేయ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం వార్షిక ఉత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన సరస్వతీ స్తోత్రంపై బృంద నాట్య ప్రదర్శన నిర్వహించారు. పట్టణానికి చెందిన చిన్నారి శ్రేయ 70 ప్రదర్శనలుచేసి ఫ్యూచర్ స్టార్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించుకున్నట్లు ఆలయ ధర్మాధికారి విద్యా మనోహరశర్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర మహాసభ అధ్యక్షుడు డా.రాధామోహన్, ఇంటర్ నేషనల్ కో ఆర్డినేటర్ వరల్డ్ రికార్డ్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డా.కేవీ రమణారావు చిన్నారి శ్రేయకు ఈ అవార్డు ప్రదానంచేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖులు, కల్చరల్ అకాడమీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న మాదవానంద సరస్వతి

దుబ్బాక: పట్టణంలో మహంకాళీ మాత 7వ వార్షికోత్సవాన్ని రెడ్డి, మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు వేలేటి జయరామ శర్మ, రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తొగుట మండలం రాంపూర్ పీఠాధిపతి మాదవానంద సరస్వతి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అమ్మవారిని దర్శించుకొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుభాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి బుచ్చిరెడ్డి, రాంరెడ్డి, రాజిరెడ్డి, దయాకర్ రెడ్డి పాల్గొన్నారు.

అపరిచితులపై అప్రమత్తత అవసరం

ఏసీపీ బాలాజీ



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ బాలాజీ

గజ్వేల్‌రూరల్: విద్యార్థినులు అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్‌లకు వచ్చే ఓటీపీలను ఎవరికీ చెప్పవద్దని ఏసీపీ బాలాజీ సూచించారు. బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ అండ్ బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాలు, బాల్య వివాహాల వల్ల కలిగే పరిణామాలు, సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, డయల్ 100 ప్రాముఖ్యత తదితర అంశాల గురించి వివరించారు. ఎవరైనా వేదించినా, ఇబ్బందులకు గురిచేసినా వెంటనే 100, సిద్దిపేట షీటీమ్ వాట్సాప్ నెంబర్ 87126 67434, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 94946 39498, సిద్దిపేట మహిళా పోలీస్‌స్టేషన్ 87126 67435 నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సైదా, తొగుట సీఐ లతీఫ్, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గ, ప్రిన్సిపాల్ శశికళ, అధ్యాపకులు, షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్ చట్టవిరుద్ధం

- రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి
- ఉత్సాహంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు



సిద్దిపేటరూరల్: ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తున్న ఎస్ఐ అపూర్వరెడ్డి

సిద్దిపేటరూరల్: ట్రాఫిక్ నిభందనలను విద్యార్థులు చిన్నతనం నుంచే పాటించాలని, మైనర్‌లు డ్రైవింగ్ చేయడం చట్టవిరుద్ధమని రూరల్ ఎస్ఐ గూడ అపూర్వరెడ్డి సూచించారు. గురువారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని చిన్నగుండవెల్లి శివారులోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ కృషి చేయాలని కోరారు. మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధలనకు సంబంధించిన సూచనలు, సిగ్నల్స్ ఎలా పాటించాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, కానిస్టేబుళ్ళు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..

మిరుదొడ్డి(దుబ్బాక): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పరశురాములు అన్నారు. అపరిచితులు ఫోన్‌చేస్తే బ్యాంకు వివరాలు, ఓటీపీలను షేర్ చేయొద్దని, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కోరారు. బైక్‌ను నడిపేటప్పుడు హెల్మెట్‌ను, కారు నడిపేటప్పుడు సీటు బెల్టును తప్పని సరిగా పెట్టుకోవాలని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటు పడాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పత్రికా ప్రకటన

దేవసాని బాలకిషన్ తండ్రి బాలరాజ్ అను నేను ప్రజ్ఞాపూర్ గ్రామవాసిని. నాకు ప్రజ్ఞాపూర్ గ్రామంలో సర్వే నంబర్ 145/అ లో 171 చదరపు గజముల ప్లాటు కలదు, ఇట్టి ప్లాటు యొక్క లింక్ దస్తావేజులు పోయినవి. లింక్ దస్తావేజుల వివరాలు దస్తావేజు నంబర్ 2173/2014 అమ్మినవారు ఊడెం లక్ష్మి భర్త ఊడెం కిష్టారెడ్డి, గ్రామం ప్రజ్ఞాపూర్. కొన్నవారు కొలుగూరి చంద్రారెడ్డి తండ్రి అంతిరెడ్డి, గ్రామం ఇప్పలగూడెం, మండలం వర్గల్. ప్లాట్ హద్దులు: తూర్పు: కానం శ్రీనివాస్ గారి ప్లాట్, పడమర: 18 ఫీట్ల రోడ్డు, ఉత్తరం: గుజ్జ వెంకటేశం గారి ప్లాట్, దక్షిణం: రాజేశ్వర్‌రెడ్డి గారి ప్లాట్ కలదు. ఇట్టి వివరాల లింకు దస్తావేజులు ఎవరికైనా దొరికినచో నా ఫోన్ నెంబర్ **9491683149** కి ఫోన్ చేసి వివరాలు తెలుపగలరు.

బిల్లుల చెల్లింపులకు సర్వే

మద్దూరు(హుస్నాబాద్): స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల కోసం గురువారం ఎంపీడీఓ రామ్మోహన్ ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలో సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో 38 మంది మరుగుదొడ్లను నిర్మించుకున్నారని వారికి వివిధ కారణాల వల్ల గతంలో బిల్లుల చెల్లింపు నిలిచిపోయిందన్నారు.

గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్

గిరిజనుల ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలు మండలాల్లోని లంబాడీలు సేవాలాల్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవాలాల్ గిరిజనులకు దశ–దిశను చూపిన మహనీయుడని, అహింసా సిద్ధాంతానికి పునాదివేసి ఆచరించి చూపారని వారంతా కొనియాడారు.



ములుగు(గజ్వేల్): సేవాలాల్ చిత్ర పటానికి పూజలు నిర్వహిస్తున్న నాయకులు, గిరిజనులు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వసతి గృహంలో...



గజ్వేల్‌రూరల్: ఆర్అండ్ఆర్ కాలనీలో..



మద్దూరు(హుస్నాబాద్): రేబర్తిలో..



వర్గల్(గజ్వేల్): ప్రతాప్‌రెడ్డి తదితరులు

పంచాయతీ కార్యదర్శి తీరుపై రభస



డబుల్ బెడ్రూంల వద్ద పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి భూపతి

కొండపాక(గజ్వేల్): మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో పంచాయతి కార్యదర్శి నవీన్‌కుమార్ తమకొద్దంటూ గ్రామస్తులు నినదించారు. అతడిని బదిలీ చేయాలంటూ గ్రామ ప్రత్యేకాధికారి భూపతిని వేడుకున్నారు. జనవరి 26 తర్వాత గ్రామానికి రాలేదని, చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకెళ్లారు. చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామంటూ గ్రామస్తులు హెచ్చరించారు. అనంతరం గ్రామంలో సమస్యలను ప్రత్యేకాధికారి భూపతి రికార్డు చేసుకున్నారు. నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్రూంల వద్ద డ్రైనేజీలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ ప్రజలు ఆయనకు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మురళి, ప్రభాకర్‌రెడ్డి, బాపు. యాదవ్వ, లచ్చవ్వ తదితరులు పాల్గొన్నారు.

మొగిపురుగుపై చర్యలు అవసరం

ఏవో మోహన్



వరి పంట పరిశీలిస్తున్న ఏవో మోహన్

తొగుట(దుబ్బాక): వరి పంటలో మొగి పురుగు ఉధృతిని తట్టుకునేందుకు దీపపు ఎర, లింగాకార బుట్ట అమర్చుకోవాలని ఏవో మోహన్ రైతులకు సూచించారు. మండలంలోని ఎల్లారెడ్డిపేటలో రైతు వెలుపుల స్వామి వరి పంటను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు సూచనలు చేశారు. మొగి పురుగును నివారించేందుకు ఇసోసైకిలో సిరం 120ఎంఎల్ ఒక ఎకరాకు క్లోరంట్రానిలిప్రోల్ 0.4గ్రాములు గుళికలు ఎకరాకు 4కిలోలు, కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరాకు 8కిలోలు, లేదా ఫైప్రోనిల్ గుళికలు ఎకరాకు 6కిలోలు, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50శాతం ఎస్పీ అనే మందును ఎకరాకు 400గ్రాములు లేదా ట్లోరన్‌రానినిపోల్ 18.5ఎస్‌సీ అనే మందును 60ఎంఎల్ ఎకరాకు, ఎసిఫేట్ 400గ్రాములు వాడాలని సూచించారు. రైతులు వరి పంటను ప్రతిరోజూ గమనించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కుమ్మరి స్వామి, ఏఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



మొగి పురుగు సోకి ఎండిన వరి పంట

రెండోసారి నాట్లు

మొగి పురుగు సోకడం వల్ల రైతులు రెండోసారి వరి నాట్లు వేస్తున్నారు. మొదట వేసిన వరికి మొగి పురుగుసోకి పూర్తిగా ఎండిపోయింది. దీంతో రైతులు మళ్లీ దున్ని వరి నాట్లు వేస్తున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో రైతులు యాసంగిలో రెండోసారి నాట్లు వేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నాడూ లేని విధంగా మొగి పురుగు వల్ల డబుల్ పెట్టుబడులు పెడుతున్నామని వాపోయారు.

– జగదేవ్‌పూర్(గజ్వేల్)

సంక్షిప్త వార్తలు

◆ బాధ్యతలు చేపట్టిన ఏసీపీలు



సీపీ అనురాధకు మొక్కను అందజేస్తున్న సుమన్‌కుమార్

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలోని సిద్దిపేట డివిజన్ నూతన ఏసీపీగా జి.మధు, ట్రాఫిక్ నూతన ఏసీపీగా ఎం.సుమన్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు సీపీ కార్యాలయంలో సీపీ అనురాధను మర్యాద పూర్వకంగా కలిశారు. సిద్దిపేట డివిజన్ పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సీపీ వారికి సూచించారు. రేషన్ బియ్యం, అక్రమ ఇసుక రవాణా, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. దొంగతనాలు జరగకుండా విజబుల్ పోలీసింగ్‌పై దృష్టి సారించాలన్నారు. రాజీవ్ రహదారిపై బ్లాక్ స్పాట్‌లను సందర్శించి ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సీపీ సూచించారు

◆ హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ఎస్సీ వసతిగృహంలో విద్యార్థినుల సంక్షేమంపై వార్డెన్ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వారి జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్థానిక వసతి గృహం నుండి విద్యార్థిని అదృశ్యమైనా వార్డెన్ పట్టించుకోవడం లేదన్నారు. వసతి గృహంలో ఏ విధమైన నిఘా లేదని విమర్శించారు. ఉన్నతాధికారులు వెంటనే వసతి గృహాన్ని సందర్శించి, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సంతోష్, రమేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

గజ్వేల్‌రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా 16న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం మండల పరిధిలోగల పలు పరిశ్రమలకు సమ్మె నోటీసులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను పెంచి ప్రజలపై భారం మోపుతోందని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకటచారి, కృష్ణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

◆ సమ్మెకు బీఎంఎస్ దూరం..

దేశవ్యాప్త సమ్మెకు బీఎంఎస్ దూరంగా ఉంటుందని ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డి, వర్కింగ్ కమిటీ సభ్యులు సల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం చెప్పారు. గురువారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర పరిధిలో ఉన్న కార్మికుల సమస్యలను కేంద్రం ఎలా పరిష్కరిస్తుందో సమ్మెల్లో పాల్గొంటున్న నేతలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎల్ బీఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

చేర్యాల(సిద్దిపేట): మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కమిషనర్ తన్నీరు రమేశ్ సూచించారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీ నుండి బదిలీపై వచ్చిన ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. చేర్యాల పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

◆ ప్రజాసేవే లక్ష్యం



జగదేవ్‌పూర్(గజ్వేల్): తన గ్రామానికి సేవ చేయాలన్న సంకల్పంతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు సామాజిక కార్యకర్త జిడిపల్లి వినోద్‌రెడ్డి తెలిపారు. గురువారం శ్రీ రంగనాయకస్వామి ఆలయ అభివృద్ధికి తమవంతుగా రూ.లక్ష విరాళంగా అందజేశారు. అలాగే ఇటీవల మృతి చెందిన కృష్ణమూర్తి, నూర్జహ కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులను అందించారు.